మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :58 | మంగళవారం , 28 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# ఆర్టీసీ సమ్మె నోటీసు

- 21 డిమాండ్లతో నోటీసులు
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్దంగా లేదు
- ప్రభుత్వంలో ఆర్టీసి విలీనం
- 2021 జీతభత్యాల సవరణ
- కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రత
- ఫిబ్రవరి 9 నుంచి సమ్మె
- ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సుల వల్ల ఉపాధి కోల్పోయే పరిస్థితి
- ఆర్టీసీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం
- మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా పనిభారం



**హైదరాబాద్,27జనవరి(క్రాంతిన్యూస్):** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. పెండింగ్‌లో చాలా సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు ఉద్యోగులు. ఆర్టీసీ ఎండీతో సమావేశమైన ఉద్యోగులు 21 డిమాండ్లతో నోటీసులు ఇచ్చారు. వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వాటిని పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 14 నెలలు అయినప్పటికీ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపలేదని ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని ఉద్యోగులు విమర్శించారు. విధి లేని పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసి విలీనం, 2021 జీతభత్యాల సవరణ, కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రత, ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వమే కొని ఆర్టీసీకి ఇవ్వాలనే డిమాండ్‌లపై ఈ నోటీసు ఇచ్చారు. డిమాండ్ల పత్రంలోని సమస్యల పరిష్కారానికి పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 22 (1) లోని నిబంధనలకు అనుగుణంగా సమ్మె నోటీస్ జారీ చేస్తున్నామన్నారు. ఈ సమ్మె తెలంగాణలోని అన్ని డిపో/యూనిట్లలో ఫిబ్రవరి 9 నుంచి సమ్మె ప్రారంభమవుతుందన్నారు. 2లో

## పెట్టుబడులను చూసి..
# మనకు అజీర్తి అయిందట
## : కేటీఆర్




- హోర్డింగ్‌లను చూసి ఏడ్వాలో.. నవ్వాలో అర్థం కావడం లేదు
- రేవంత్ ఉద్యమంలో ఉల్టా ఉన్నావు.. తుపాకీ పట్టుకుని విద్యార్థుల మీదకు గురిపెట్టావు
- చావు నోట్లో తలపెట్టి, పురిటినొప్పులు పడి తెలంగాణ అనే బిడ్డకు జన్మనిచ్చిన పాత్ర టీఆర్ఎస్‌ది
- కాంగ్రెస్ ది మంత్రసాని పాత్ర
- పెట్టబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషపడుతాం
- నేతి బీరకాయలో ఎంత నెయ్యి ఉంటదో.. కాంగ్రెస్ పార్టీ 420 హామీల్లో కూడా వాస్తవం అంతే ఉంటది
- రేవంత్ రెడ్డి చేతనైతే ఎప్పుడు పెట్టుబడులు వస్తాయో చెప్పు
- పిల్లలకు ఉద్యోగాలు ఎప్పుడు వస్తాయో చెప్పు
- మా కంటే ఎక్కువ చేసి చూపెడితే సన్మానం చేస్తా
- ఆహా నా పెళ్లంట సినిమాలోని కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ నీది
- మా ప్రభుత్వంలో 6 లక్షల 50 వేలు రేషన్ కార్డులు ఇచ్చాం
- 2021 జులైలో రేషన్ కార్డులు ఇస్తూ భట్టి విక్రమార్క ఫొటోలు దిగారు
- కాంగ్రెసోళ్లు గోబెల్స్ వారసులు

**హైదరాబాద్,27జనవరి(క్రాంతిన్యూస్):** ఈ సిపాయిలు తీసుకొచ్చిన పెట్టుబడులను చూసి మనకు అజీర్తి అయిందట.. మనం ఈనో తాగాలట అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెసోళ్లు పెట్టిన హోర్డింగ్‌లను చూసి ఏడ్వాలో.. నవ్వాలో అర్థం కావడం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం కేటీఆర్ ప్రసంగించారు.

రేవంత్ రెడ్డి నువ్వు తెలంగాణ ఉద్యమంలో ఉల్టా ఉన్నావు.. తుపాకీ పట్టుకుని విద్యార్థుల మీదకు గురిపెట్టావు. ఉద్యమంలో కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు తేడా ఏందంటే.. 9 నెలల పాటు ఒక తల్లి బిడ్డను ఎలా మోస్తదో.. పురిటినొప్పులు పడుతూ ఒక బిడ్డకు ఎలా జన్మనిస్తదో.. అలానే టీఆర్ఎస్ కూడా కేసులు ఎదుర్కొని, దెబ్బలు తిని, ఎదురుదెబ్బలు తిని,

అవమానాలకు గురై 14 ఏండ్ల పాటు తెలంగాణ ప్రజలను ఐక్యం చేసి.. చావు నోట్లో తలపెట్టి.. తల్లి పాత్ర పోషించి, పురిటినొప్పులు పడి తెలంగాణ అనే బిడ్డకు జన్మనిచ్చిన పాత్ర టీఆర్ఎస్‌ది. తెలంగాణ ఉద్యమంలో నీ కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏంది.. ఉంటే గింటే ఆ మంత్రసాని పాత్ర పోషించింది అని కేటీఆర్ తెలిపారు. 2లో

# రైతుల ఫోన్లకు టింగ్.. టింగ్ మంటూ మెసేజ్‌లు


2లో

**హైదరాబాద్,27జనవరి(క్రాంతిన్యూస్):** సీఎం రేవంత్ చేతుల మీదుగా జనవరి 26న రైతుభరోసా పథకం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ. 6000 చొప్పున అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తామన్నారు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతు భరోసా నిధులు జిల్లాలో ప్రతి మండలానికి ఒక్కో గ్రామం చొప్పున మొదట విడత విడుదల చేయడం జరిగిందన్నారు. విడుదల చేసిన నిధులు ఇవాళ జనవరి 27న రైతుల అకౌంట్లలో జమ చేయబడ్డాయని తెలిపారు.

## యూజీసీ మార్గదర్శకాలపై స్పందించిన ఉన్నత విద్యామండలి చైర్మన్

3లో

## సమాజమే మారాలి..
# ఏం చేయలేం..!
## - సుప్రీంకోర్టు

గృహహింస చట్టాన్ని సవరించాలన్న పిటిషన్‌పై 'సుప్రీం' కీలక వ్యాఖ్యలు..



2లో

వరకట్నం, గృహహింస చట్టాల్లో సంస్కరణలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సమాజమే మారాలని.. అందులో ఏమీ చేయలేమని చెప్పింది. ప్రస్తుతం ఉన్న వరకట్న, గృహహింస చట్టాలు దుర్వినియోగమవుతున్నాయని.. వాటిని సంస్కరణించాలని పిటిషన్‌లో కోరారు.

## తెలంగాణ
# నీటి వాటాలను కాపాడాలి..
## కిషన్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ

గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం అవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు తక్షణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంలో జరుగుతున్న జాప్యం, రాష్ట్రానికి జరుగుతున్న నష్టంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.


3లో


T. HARISH RAO
M.L.A.,
33-Siddipet Assembly Constituency

Camp Office : H.No. 18-1924, Prashanthnagar, Siddipet Town and District. Cell : 084572 22222

Hyderabad Office : Villa No. 1025, Krinss Villas, Puppalaguda, Financial District, Hyderabad. Contact No. 040-23114222 Cell : 94404 71409

గౌరవనీయులు శ్రీ కిషన్ రెడ్డి గారు,
కేంద్ర బొగ్గు & గనుల శాఖామాత్యులు

నమస్కారం
తెలంగాణ రాష్ట్రం నుంచి సికింద్రాబాద్ లోక్ సభ సభ్యునిగా, కేంద్ర క్యాబినెట్ మంత్రిగా రెండవసారి పని చేస్తున్నందుకు అభినందనలు. కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగానికి సాధించవలసిన కొన్ని అంశాలను మీ దృష్టికి తీసుకురావాలని తలచి ఈ లేఖ రాస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి – బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు 80 వేల కోట్ల రూపాయలతో చేపట్టి 200 టిఎంసిల గోదావరి నీటిని బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్ ద్వారా పెన్నా బేసిన్ కి తరలించాలని తలపోసిన సంగతి, ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు సమకూర్చే విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి రెండు లేఖలు కూడా రాసిన సంగతి మీకు తెలిసే ఉంటుందని ఆశిస్తున్నాను. ప్రాజెక్టు వివరాలు పంపించమని కేంద్ర ప్రభుత్వం గోదావరి బోర్డుకు సూచించినట్టు కూడా పత్రికల్లో వార్తలు వచ్చినాయి. దీన్నిబట్టి చంద్రబాబు నాయుడు గారి లేఖను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టుగా అవగతం అవుతున్నది. గోదావరి నదీ జలాల్లో తెలంగాణ నీటి హక్కులకు ఈ ప్రాజెక్టు వలన భంగం వాటిల్లనుందని సాగునీటి రంగ నిపుణులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం - 2014 ప్రకారం కొత్త ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు గోదావరి / కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు గాని, బోర్డులకు గాని సమాచారం

1

## నాకు పద్మశ్రీ వస్తే
# నీకేం నొప్పి

రేవంత్ పై భగ్గుమన్న మందకృష్ణ!


3లో

# పోలీస్ వర్సెస్ రెవెన్యూ వార్




**కరీంనగర్,27జనవరి(క్రాంతిన్యూస్):** కరీంనగర్‌లో పోలీస్ వర్సెస్ రెవెన్యూ వార్ నడుస్తోంది. రెవెన్యూ అధికారులు మాత్రం తగ్గేదేలే అని అంటున్నారు. కరీంనగర్‌లో నువ్వా నేనా అనే విధంగా రెవెన్యూ, పోలీస్ విభాగాల మధ్య వివాదం ముదురుతోంది. ఏమి చేయాలో తోచక పోలీసులు మల్లాగుల్లాలు పడుతున్నారు. దీనికి కారణం కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పర్యటనే అనే తెలుస్తోంది. మూడు రోజుల క్రితం కరీంనగర్‌లో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పర్యటించారు.

ఈ పర్యటనలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అయితే మంత్రులను పోలీసులు పదే పదే తోసేశారు. దీంతో మంత్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే ఈ పర్యటనలో జరిగిన ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు మెమోలు జారీ చేసి వివరణ కోరారు. 2లో

## గద్దర్‌కి పద్మ అవార్డు
# ఎలా ఇస్తాం..?
## - బండి సంజయ్



ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అడ్డదిడ్డంగా మాట్లాడారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా..?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. 2లో


# గ్రామాల్లో కేసీఆర్ పాలనే బాగుందంటున్నారు..
## : కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



సంచలన వ్యాఖ్యలు, ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తూ.. తరచూ వార్తల్లో నిలిచే మునుగోడు కాంగ్రెస్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఏకంగా అధికారిక కార్యక్రమంలోనే ప్రజల సమక్షంలో తమ ప్రభుత్వంపైనే సెటైర్లు వేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించిన నేపథ్యంలో.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం మసీదు గూడెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నాలుగు సంక్షేమ పథకాల అమలు గురించి సొంత ప్రభుత్వంపైనే సెటైర్లు వేసుకోవటం సభలో పాల్గొన్న అధికారులతో పాటు ప్రజలను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. 2లో

# నేటిమాట

ఆవేశాన్ని తగ్గించుకుని, ఊహాలో కంలో విహరించటం మానుకున్న వ్యక్తి తప్పనిసరిగా విజయాన్ని సాధించగలుగుతాడు.



- జెరెమైకోలియర్

# ఆర్టీసీ సమ్మె నోటీసు

మొదటి పేజీ తరువాయి

దాదాపు నాలుగేళ్ల క్రితం తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. అప్పట్లో ఈ సమ్మె పెను సంచలనాలనే సృష్టించింది. ప్రభుత్వానికి, ఆర్టీసీకి మధ్య వార్ లాంటి పరిస్థితి కనిపించింది. అప్పట్లో ఇచ్చిన డిమాండ్లు కొన్నింటిని నాటి ప్రభుత్వం విస్మరించిందని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటికి పరిష్కార లభిస్తుందని ఇంత కాలం ఎదురు చూశామని అంటున్నారు. అయినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతోనే సమ్మెకు నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని అంటున్నారు.

కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమను పట్టించుకోవడం లేదని.. తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆర్టీసీ కార్మికులు చెబుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోవడంపై ఆర్టీసీ కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి. ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సుల వల్ల ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని.. అలాగే ఆర్టీసీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడుతున్నారు. అలాగే ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా పనిభారం కూడా పెరిగిందని కార్మికులు వాపోతున్నారు.

ఈవీ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. సర్వీసుల్లో ఉన్నవారి సమస్యలే కాదు.. రిటైర్డ్ అయిన వారి సమస్యలు ఇంకా తీరనే లేదని, పెండింగ్‌లో బకాయిలు, అడుగు పడని పేస్కేళ్లు, చెల్లించని సీసీఎస్ బకాయిలు, డీఏ బకాయిలు, యూనియన్ల ఏర్పాటు, ప్రభుత్వంలో విలీనం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాల సవరణ ఎన్నో హామీలు ఇచ్చారని ఆర్టీసీ జేఏసీ పేర్కొంది. నోటీసులపై ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది.

**ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న**

## డిమాండ్స్ ఇవే

1. మేనిఫెస్టోలో ఆర్టీసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఆర్థికపరమైన అంశాలను అమలు చేస్తూ ప్రస్తుత సౌకర్యాలను కొనసాగిస్తూ ప్రభుత్వంలో విలీనం చేయాలి. ప్రభుత్వోద్యోగులతో సమానంగా జీతాలు అమలు చేయాలి. 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాలి. కొత్త బస్సుల కొనుగోలు ద్వారా ఆర్టీసిని అభివృద్ధి చేసి ఆధునీకరించాలి.

2. సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ వేసి, రాయితీలకు సంస్థ అభివృద్ధికి ప్రతియేటా బడ్జెట్లో 3% కేటాయించాలి.

3. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆర్టీసికి ఇవ్వాలి.

4 యాజమాన్యం వాడుకున్న సిసిఎస్, ఎస్ఆర్బిఎస్, పిఎఫ్ నిధులను వెంటనే విడుదల చేస్తూ, సిసిఎస్ లో ఎన్నికలు నిర్వహించి, ఆఫీసు సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి.

5. మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి.

6 బ్రెడ్ విన్నర్, మెడికల్ ఇన్వాలిడేషన్ ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే ఉద్యోగాలు, రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. ప్రస్తుతం కన్సాలిడేటెడ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు పర్మెనెంట్ చేయాలి. ప్రభుత్వ జీవో ఎం.ఎస్ చెం. 30. తేది 08-07-2024 ప్రకారం వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచాలి. ఈ స్కీమ్‌లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ వంటి పోస్టులను కూడా ఇవ్వాలి.

7. అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేసి అర్హులైనవారికి ప్రమోషన్లు ఇవ్వాలి.

8. ప్రతి కార్మికునికి 21 రోజుల హాజర్‌తో ఇన్సెంటివ్ ఇవ్వాలి. బస్‌బాడీ బిల్డింగ్‌తోపాటు మిగిలిన వర్క్షను బలోపేతం చేయాలి. ప్రొడక్షన్ యూనిట్లలో 2013 నుంచి రావలసిన మ్యాన్ అవర్ రేటు అమలు చేయాలి.

9. తార్నాక హాస్పిటల్లో అన్ని విభాగాల్లో సిబ్బందిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. రోగులు, వారి వెంట వస్తున్న అటెండెంట్లకు భోజన, వసతి సౌకర్యం కల్పించాలి.

10 ఆర్టీసి ఉద్యోగులకు తార్నాక హాస్పిటల్లో మెరుగైన వైద్య సౌకర్యం కల్పిస్తూ, ఉద్యోగి ఫ్యామిలీతోపాటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో వారి తల్లిదండ్రులకు కూడా వైద్య సౌకర్యం కల్పించాలి.

11. సంస్థలో రిటైరైన ఉద్యోగులకు సరిపడా మందులు సరఫరా చేయాలి. వైద్య పరీక్షలకయ్యే ఖర్చు యాజమాన్యమే భరించాలి.

12. రిటైరైన ఉద్యోగులకు రావలసిన అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలి. రిటైర్ కాబోతున్న ఉద్యోగులకు అదేరోజు అన్ని సెటిల్మెంట్ మొత్తాలను చెల్లించాలి.

13 అకౌంట్స్ విభాగంలో సెంట్రలైజేషన్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలి

14. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న డిటైర్డ్ అధికారులు సూపర్వైజర్లను తీసివేసి వారి స్థానంలో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలి అవుటోర్సింగ్ ద్వారా కన్సల్టెన్సీల పేరు మీద జరుగుతున్న ఆర్థిక దుబారాను అరికట్టాలి.

15. అన్ని యూనిట్లలో మహిళలతోపాటు పురుషులకు కూడా అన్ని వసతులతో పాటు తాగునీరు, వాహనాల పార్కింగ్కు సరిపడ షెడ్స్ నిర్మించాలి.

16. పాత రెగ్యులేషన్స్ సమూలంగా మార్చి డ్రైవర్ కిండక్టర్, మెయిన్టినెన్స్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి,

17. అక్రమ సస్పెన్షన్, రిమూవల్ అయినవారిని మరియు అమ్మీట్ రిజెక్ట్ అయినవారిని విధులలోకి తీసుకోవాలి.

18. జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాస్ అయి ఉన్నవారికి పోస్టింగ్ ఇవ్వాలి. మిగిలిన ఖాళీలకు డిపార్టుమెంట్ టెస్టు నిర్వహించి భర్తీ వేయాలి.

19. 2019వ సంవత్సరం సమ్మెకాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీస్ కేసులను ఎత్తి వేయాలి.

20. అద్దె బస్సు డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఇఎస్ఐఐ ఆస్పత్రులలో వైద్య సౌకర్యం కల్పించాలి. పిఎఫ్ కాంట్రిబ్యూషన్ రికవరీ చేయాలి.

21. ఎంటిడబ్ల్యు యాక్ట్ ప్రకారం 8 గంటల పని దినాలు (సిటీ సర్వీసులలో 7 గంటలు) అమలు చేసి మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల లోపు డ్యూటీ పూర్తయ్యేలా డ్యూటీలు ఇవ్వాలి. ప్రతి కార్మికునికి నెలకు 3 రోజులు సెలవులు మంజూరు చేయాలి.

### రైతుల ఫోన్లకు

# టింగ్.. టింగ్ మంటూ మెసేజ్‌లు

మొదటి పేజీ తరువాయి

**జిల్లాల వారిగా విడుదలైన నిధుల వివరాలు..**

ఆదిలాబాద్ జిల్లాలో 17 మండలాలలోని 21 గ్రామాలకు చెందిన 6,411 మంది రైతులకు 14.49 కోట్లు

భద్రాద్రి కొత్తగూడం జిల్లాలో 23 మండలాలోని 25 గ్రామాలకు చెందిన 22,242 రైతులకు 39.07 కోట్లు

హన్మకొండ జిల్లాలో 12 మండలాలోని 12 గ్రామాలకు చెందిన 12,545 రైతులకు 14.30 కోట్లు

జగిత్యాల జిల్లాలో 20 మండలాలోని 20 గ్రామాలకు చెందిన 22,242 రైతులకు 39.07 కోట్లు

జనగామ జిల్లాలో 12 మండలాలోని 12 గ్రామాలకు చెందిన 12,320 రైతులకు 15.91 కోట్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలోని 12 గ్రామాలకు చెందిన 7,073 రైతులకు 8.67 కోట్లు

జోగులాంబ గద్వాల జిల్లాలో 13 మండలాలోని 13 గ్రామాలకు చెందిన 7,829 రైతులకు 12.47 కోట్లు

కామారెడ్డి జిల్లాలో 22 మండలాలోని 24 గ్రామాలకు చెందిన 9,062 రైతులకు 8.35 కోట్లు

కరీంనగర్ జిల్లాలో 15 మండలాలోని 15 గ్రామాలకు చెందిన 14,226 రైతులకు 15.96 కోట్లు

ఖమ్మం జిల్లాలో 21 మండలాలోని 21 గ్రామాలకు చెందిన 20,802 రైతులకు 28.42 కోట్లు

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలోని 19 గ్రామాలకు చెందిన 4,344 రైతులకు 8.62 కోట్లు

మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలోని 19 గ్రామాలకు చెందిన 14,611 రైతులకు 18.14 కోట్లు

మహబూబ్ నగర్ జిల్లాలో 16 మండలాలోని 16 గ్రామాలకు చెందిన 14,575 రైతులకు 17.27 కోట్లు

మంచిర్యాల జిల్లాలో 16 మండలాలోని 17 గ్రామాలకు చెందిన 7,143 రైతులకు 8.72 కోట్లు

మెదక్ జిల్లాలో 21 మండలాలోని 21 గ్రామాలకు చెందిన 14,833 రైతులకు 14.06 కోట్లు

మేడ్చల్ జిల్లాలో 5 మండలాలోని 5 గ్రామాలకు చెందిన 2,706 రైతులకు 3.14 కోట్లు

ములుగు జిల్లాలో 9 మండలాలోని 9 గ్రామాలకు చెందిన 6,678 రైతులకు 8.26 కోట్లు

నాగర్ కర్నూల్ జిల్లాలో 20 మండలాలోని 20 గ్రామాలకు చెందిన 16,806 రైతులకు 23.05 కోట్లు

నల్లగొండ జిల్లాలో 31 మండలాలోని 31 గ్రామాలకు చెందిన 35,568 రైతులకు 46.93 కోట్లు

నారాయణపేట జిల్లాలో 13 మండలాలోని 13 గ్రామాలకు చెందిన 9,348 రైతులకు 13.87 కోట్లు

నిర్మల్ జిల్లాలో 18 మండలాలోని 18 గ్రామాలకు చెందిన 7,912 రైతులకు 10.56 కోట్లు

నిజామాబాద్ జిల్లాలో 31 మండలాలోని 31 గ్రామాలకు చెందిన 35,568 రైతులకు 46.93 కోట్లు

పెద్దపల్లి జిల్లాలో 13 మండలాలోని 13 గ్రామాలకు చెందిన 9,885 రైతులకు 10.14 కోట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలోని 12 గ్రామాలకు చెందిన 9,724 రైతులకు 12.26 కోట్లు

రంగారెడ్డి జిల్లాలో 21 మండలాలోని 21 గ్రామాలకు చెందిన 15,597 రైతులకు 20.32 కోట్లు

సంగారెడ్డి జిల్లాలో 25 మండలాలోని 25 గ్రామాలకు చెందిన 19,933 రైతులకు 24.15 కోట్లు

సిద్దిపేట జిల్లాలో 26 మండలాలోని 26 గ్రామాలకు చెందిన 31,170 రైతులకు 36.76 కోట్లు

సూర్యాపేట జిల్లాలో 23 మండలాలోని 23 గ్రామాలకు చెందిన 29,352 రైతులకు 37.84 కోట్లు

వికారాబాద్ జిల్లాలో 20 మండలాలోని 20 గ్రామాలకు చెందిన 8,609 రైతులకు 11.18 కోట్లు

వనపర్తి జిల్లాలో 15 మండలాలోని 15 గ్రామాలకు చెందిన 9,441 రైతులకు 12.25 కోట్లు

వరంగల్ జిల్లాలో 11 మండలాలోని 11 గ్రామాలకు చెందిన 11,386 రైతులకు 12.86 కోట్లు

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలోని 17 గ్రామాలకు చెందిన 17,576 రైతులకు 26.95 కోట్లు విడుదల అయ్యాయి.

మొత్తంగా 32 జిల్లాలలోని 563 మండలాలకు చెందిన 577 గ్రామాలలోని 4,41,911 మంది రైతులకు సంబంధించి 9,48,333 ఎకరాల భూమికి, వారి ఖాతాలలో మొత్తం రూ. 569 కోట్లు జమ అయ్యాయి. ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా పంట పెట్టుబడి సాయాన్ని పెంచి రైతు భరోసా పథకాన్ని కూడా మొదలు పెట్టడం జరిగిందని, రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసాని అందచేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## పోలీస్ వర్సెస్ రెవెన్యూ వార్

మొదటి పేజీ తరువాయి

ఈ విషయంపై కలెక్టర్ త్వరాత వివరణ కూడా ఇచ్చారు. కానీ ఈ వివాదం అంతటితో సద్దుమణిగినట్లు కనిపించడం లేదు. తాజాగా మరోసారి ఈ వివాదంలో పోలీసులు వర్సెస్ రెవెన్యూ అధికారులు అన్న చందంగా మారింది. దీంతో ఇప్పుడు ఈ వివాదం రాజుకుంది.

కరీంనగర్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు రెవెన్యూ శాఖ అడ్డుపుల్ల వేసినట్లు తెలుస్తోంది. రేపు జరగాల్సిన స్పోర్ట్స్ మీట్‌కు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఆటంకాలు కల్పిస్తోంది. అంబేద్కర్ స్టేడియం తలుపులకు తాళాలు, గెస్ట్‌హౌస్ ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. రేపు ఉదయం అట్టహాసంగా ప్రారంభం కావాల్సిన స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. రెవెన్యూ అధికారుల తీరుతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కరీంనగర్ పోలీసులు ఉన్నారు. రెవెన్యూ శాఖతో వివాదంతో పోలీసుశాఖకు అన్ని విభాగాలు సహాయ నిరాకరణ చేపట్టాయి. ఇటీవల జరిగిన పరిణామాలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇప్పుడు ఈ రెండు శాఖల మధ్య ఉన్నతస్థాయి అధికారులు కల్పించుకుని సద్దుమణిగేలా చేయాల్సి ఉంది.

## గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..?

### - బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో.. ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి 5 అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..? ఆయన భావజాలం ఏంటి..? బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం..? అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## సమాజమే మారాలి..

### ఏం చేయలేం..! - సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

చట్టాలను సమీక్షించేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బెంగళూరులో ఓ టెకీ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. చట్టబద్ధంగానే తన భార్య వేధింపులకు గురి చేస్తుందంటూ.. చట్టంలోని లొసుగులను బయటపెట్టాడు. టెకీ ఆత్మహత్య తర్వాత వరకట్నం, గృహహింస చట్టాల దుర్వినియోగంపై పెద్ద ఎత్తున చర్చ ప్రారంభమైంది. ఈ క్రమంలోనే చట్టంలో సంస్కరణ తీసుకురావాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

న్యాయవాది విశాల్ తివారీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను సమీక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రలతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. సమాజమే మారాలని.. ఇందులో కోర్టులు ఏం చేయలేమని బెంచ్ స్పష్టం చేసింది. వివాహ నమోదు సమయంలో ఇచ్చిన కానుకలను సైతం నమోదు చేయాలని ఆయన తివారీ డిమాండ్ చేశారు. దాంతో పాటు ఐపీసీ సెక్షన్ 498ఏకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను అమలు చేయాలని కోరారు. చట్టాల్లో సంస్కరణలు తీసుకురావడం ద్వారా అమాయక వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చని.. చట్టం ఉద్దేశం సైతం నెరవేరుతుందని పిటిషనర్ పేర్కొన్నారు.

# పెట్టుబడులను చూసి.. మనకు అజీర్తి అయిందట

### : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

నీవు పెట్టబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషపడుతాం. రూ. లక్షా 78 వేల కోట్లు అని బిల్డప్ ఇచ్చుడు కాదు.. 2024లో ఇట్లనే చెప్పారు.. రూ. 42 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కానీ ఇవాళ ప్రజలు మీ మీద అనుమాన పడుతున్నారు. నేతి బీరకాయలో ఎంత నెయ్యి ఉంటదో.. కాంగ్రెస్ పార్టీ 420 హామీల్లో కూడా వాస్తవం అంతే ఉంటది అని. 42 వేల కోట్ల పెట్టబడులు అని చెప్పినా.. ఇప్పటికీ ఒక్కటి కూడా రాలేదు.. కాబట్టి నిన్ను ఎవరు నమ్ముతలేరు. ప్రభుత్వ, ప్రజల పైసలతో హోర్డింగ్స్ పెడుతున్నవ్.. మా బొమ్మలు ఎందుకు.. చేతనైతే నీ బొమ్మ పెట్టుకో. రేవంత్ రెడ్డి చేతనైతే ఎప్పుడు పెట్టుబడులు వస్తాయో చెప్పు.. మా పిల్లలకు ఉద్యోగాలు ఎప్పుడు వస్తాయో చెప్పు. మా కంటే ఎక్కువ చేసి చూపెడితే మీకు సన్మానం కూడా చేస్తాను అని కేటీఆర్ పేర్కొన్నారు.


నిన్న కొడంగల్‌లో ఒకటే స్పీచ్‌లో రెండు మాటలు మాట్లాడిండు.. తెల్లారే వరకు అందరికి రైతు భరోసా పైసలు పడుతవి అని చెప్పిండు.. 15 నిమిషాల్లో మాట మార్చిండు.. రేవంత్ రెడ్డిని చూస్తే డౌటస్తుంది.. అపరిచితుడు సినిమాలో రాము, రెమోలా ఉన్నాడు. అందరికీ తెల్లారే వరకు డబ్బులు పడుతవి అని అన్నాడు.. పది నిమిషాల్లోనే మాట మార్చి 31 వరకు అన్నాడు. ఏడాది మళ్లీ చెప్పలేదు. కాబట్టి వీరి మాటలకు గ్యారెంటీ లేదు. మార్చి 31 డెడ్‌లైన్ ఎందుకు పెట్టిండో తెలుసా.. ఓట్ల కోసం. 12786 గ్రామపంచాయతీలు ఉంటే 612 గ్రామాల్లోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తడంట అని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఆ సినిమాలోని కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ మాదిరి.. రేవంత్ రెడ్డి పాలన**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆహా నా పెళ్లంట సినిమాలోని కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ మాదిరి సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.

ఇవాళ మనం డిజిటల్ యుగంలో ఉన్నాం.. ఇవాళ ఒక నిజం కడప దాటే లోపే అబద్ధం ఊరంతా తిరిగిచ్చే పరిస్థితి. ఆహా నా పెళ్లంట సినిమాలో కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ పిసినారిగా ఉంటుంది. చికెన్ పెడుతా అని ఇంటికి కొందరిని పిలుస్తాడు. ఇక ప్లేట్‌లో అన్నం, చట్నీ వేసి.. ముందట కోడిని వేలాడదీస్తాడు.. ఇదే చికెన్ అని ఊరిస్తాడు. ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరు అలాగే ఉంది. ఆరునూరైనా సరే.. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం, చేసి చూపెడుతా అని గంభీరమైన డైలాగులు కొట్టారు. ఇది చేస్తాం.. అది చేస్తాం.. పొడిచెస్తాం అని 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఇవాళ 14వ నెల నడుస్తుంది. ఇప్పుడు కూడా సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారు. అబద్దాలు చెబితే కూడా అతికేలా ఉండాలి. కానీ ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మాటలు వింటే నవ్వాలో ఏడ్వాలో తెలుస్తలేదు. రేషన్ కార్డులు జారీ చేయడం చారిత్రాత్మక కార్యక్రమం అని సీఎం మాట్లాడుతున్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఒక్క రేషన్ కార్డు కూడా బీఆర్ఎస్ ఇవ్వలేదని చెబుతుండు. 2021 జులైలో రేషన్ కార్డులు ఇస్తూ తన సొంత నియోజకవర్గం మధిరలో భట్టి విక్రమార్క ఫొటోలు దిగారు. మన ప్రభుత్వంలో 6 లక్షల 50 వేలు రేషన్ కార్డులు ఇచ్చాం. మీ సేవల దరఖాస్తు పెట్టుకుంటే ఇచ్చాం. కానీ రేవంత్ లాగా ప్రభుత్వ పైసలతో ఆర్భాటాలు చేసి సన్నాయి నొక్కులు నొక్కలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

కాంగ్రెసోళ్లు గోబెల్స్ వారసులు. ఒకటి కాదు రెండు కాదు.. 420 హామీలు ఇచ్చారు. ఎస్సీ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్ ఇచ్చారు. విద్యార్థి డిక్లరేషన్ కూడా ఇచ్చారు. ఢిల్లీ నుంచి టూరిస్టులను తీసుకొచ్చి డిక్లరేషన్ల పేరిట ఊదరగొట్టారు. ఇవి నమ్ముతలేరని చెప్పి బాండ్ పేపర్లను పట్టుకుని ఆఫిడవిట్లు తయారు చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఒట్లు పెట్టి డ్రామాలు ఆడారు. గ్యారెంటీ కార్డులు పంచారు. జోసెఫ్ గోబెల్స్ వారసుల మాదిరిగా విస్తృతంగా అబద్ధాలు ప్రచారం చేశారని కేటీఆర్ మండిపడ్డారు.



## గ్రామాల్లో కేసీఆర్ పాలనే బాగుందంటున్నారు..

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క పథకానికి కూడా సారిగ్గా న్యాయం చేయలేకపోతున్నామని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే ఒప్పుకున్నారు. అందుకే గ్రామాల్లో ప్రజలు తమ ప్రభుత్వాన్ని తిడుతున్నారని.. కేసీఆర్ ప్రభుత్వమే బాగుందంటున్నారని చెప్పుకొచ్చారు. మొన్న జరిగిన గ్రామ సభల్లో కూడా జనాలు అధికారులను నిలదీశారని.. ప్రభుత్వాన్ని తిడుతున్నారని గుర్తుచేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. రైతుబంధును రూ.15వేలకు పెంచి ఇస్తామని చెప్పామని తెలిపారు. అయితే.. రైతుబంధు కాదు రైతు భరోసా అని అక్కడున్న నేతలు చెప్పగానే.. ఇప్పుడు పేరు మార్చారంటూ సెటైర్ వేశారు. అయితే.. ప్రభుత్వం ఏర్పడగానే రైతుబంధు ఇచ్చామని.. కానీ మధ్యలో డుమ్మీ (కోత) కొట్టామని స్వయంగా ఒప్పుకున్నారు కోమటిరెడ్డి.

అంతే కాకుండా.. 15 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రైతు భరోసాలో కూడా కొంత డుమ్మీ (కోత) కొట్టామంటూ మరో సెటైర్ వేసుకున్నారు. దానికి కారణం మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులంటూ కవరింగ్ చేసే ప్రయత్నం చేశారు. మరోవైపు.. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గురించి, వాటికి పెట్టిన రూల్స్ గురించి సెటైర్లు వేశారు. భూమి లేని రైతు కూలీలను కూడా ఆదుకోవాలన్న ఉద్దేశంతో సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించామని.. కానీ ఆ పథకానికి రూల్స్ ఎందుకు పెట్టారో అర్థం కావట్లేదన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల్లో 20 రోజులు పని చేస్తేనే డబ్బులు ఇస్తామని పెట్టడమేంటని అక్కడే ఉన్న అధికారులను ప్రశ్నించారు. ఏదో పనిపై పనుల్లో పాల్గొనకపోయినా, బతుకుదెరువు కోసం వేరే ఊరికిపోయిన నిరుపేదలకు, గుంట భూమి కూడా లేనివారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వమంటే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో, సంబంధిత మంత్రితో మాట్లాడి.. సడలింపు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. గ్రామంలో కొంత మందికే పథకాలు వచ్చాయని.. ఇంకొంత మందికి వచ్చే అవకాశం ఉందని.. వాళ్లేవరూ ఆగమాగం కావొద్దని, ఆందోళన చెందొద్దని కోమటిరెడ్డి తెలిపారు. అర్హులైన అందరికీ పథకాలు వచ్చేలా ఎమ్మెల్యేగా తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మరోవైపు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రైతు రుణమాఫీ చేశామని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే.. చాలా మంది తమకు రుణమాఫీ కాలేదని, రైతు బంధు రాలేదని.. ప్రభుత్వాన్ని తిడుతున్నారని గుర్తుచేశారు. రుణమాఫీ చేసిన తర్వాత కూడా కేసీఆర్ పాలనే బాగుండే అని మెచ్చుకుంటున్నారని చెప్పుకొచ్చారు. రుణమాఫీ కింది.. రూ.2 లక్షల రుణమాఫీ అయినవాళ్లు మాత్రం డబ్బులు జేబుల్లో వేసుకొని ఏం మాట్లాడట్లేదని.. కానీ వాళ్లు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇష్టమున్నట్టు తిడుతున్నారని చెప్పుకొచ్చారు.

ఇలా ప్రసంగం మొత్తంలో చాలా సార్లు తమ ప్రభుత్వం చేసే పనులపై సెటైర్లు వేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు ఇప్పటికీ మెచ్చుకుంటున్నారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ రావటం గమనార్హం. మరి తెలిసి మాట్లాడారా తెలియక మాట్లాడారో కానీ.. ప్రారంభిస్తున్న పథకాల పేర్లు కూడా అధికారులను అడిగి పలకటం, వివరాలు కూడా పదే పదే అడగటం, రూల్స్ గురించి సాధారణ జనాల్లో వ్యతిరేకించటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

# నాకు పద్మశ్రీ వస్తే నీకేం నొప్పి

## రేవంత్ పై భగ్గుమన్న మందకృష్ణ!



సీఎం రేవంత్ రెడ్డిపై మందకృష్ణ మాదిగ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను సిఫారసు చేసిన వ్యక్తులకు పద్మ పురస్కారం రాలేదని రేవంత్ బాధపడుతున్నాడో లేదా తనకు వచ్చిందని బాధపడుతున్నాడో.. అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. 30 ఏళ్ల ఉద్యమంలో తనకు చరిత్ర లేదా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సిఫారసు చేసిన వ్యక్తుల జాబితాలో తన పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. వారంతా ఇప్పటికే ప్రభుత్వం నుంచి లబ్ధిపొందారన్నారు.

### గద్దర్, గోరటి పేర్లు ఎందుకు పంపావ్?

తాను బీజేపీ మనిషిని అనుకుంటే.. గద్దర్, గోరటి వెంకన్న పేర్లను బీజేపీ ప్రభుత్వానికి ఎందుకు పంపించాడని ప్రశ్నించారు. లేఖ రాసి వదిలిపెట్టి కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించిన వ్యక్తులకు పురస్కారం వచ్చేలా ఏమైనా ప్రయత్నాలు చేశారా? అన్న అంశం తేలాలలన్నారు.

నాకు పద్మశ్రీ రావడంపై రేవంత్ రెడ్డి బాధపడుతున్నట్లు ఉందని ఫైర్ అయ్యారు. మందకృష్ణకు పద్మా పురస్కారం రావడం సంతోషమే కానీ.. అంటూ నిన్న రేవంత్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు మందకృష్ణ.

### కేంద్రంపై రేవంత్ అసంతృప్తి..

పద్మ పురస్కారాల విషయంలో కేంద్రం తెలంగాణపై వివక్ష చూపించిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు తదితర ప్రముఖులకు పద్మశ్రీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిందని వెల్లడించారు. కేంద్రం ఆ ప్రతిపాదనలను పరిగణలోనికి తీసుకోకపోవడం నాలుగు కోట్ల ప్రజలను అమానించడమేనన్నారు. 139 మందికి పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం తెలంగాణకు కనీసం 5 పురస్కరాలు కూడా ప్రకటించకపోవడం సరికాదన్నారు.

# తెలంగాణ నీటి వాటాలను కాపాడాలి.. కిషన్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడం వల్ల తెలంగాణ సాగునీటి ప్రయోజనాలు హరించబడతాయని హరీశ్‌రావు అన్నారు. విభజన చట్టం ప్రకారం గోదావరి-కృష్ణా బోర్డుల అనుమతులు తప్పనిసరిగా ఉన్నా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపట్టడం చట్ట ఉల్లంఘించడమే అని స్పష్టం చేశారు.


గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రాజెక్టుకు నిధుల కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రెండు లేఖలు రాయడం పట్ల హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే ప్రణాళికల అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉండటం శోచనీయమని అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు %ూాజ% అనుమతి రావడానికి కేంద్రం 6 నెలలుగా జాప్యం చేస్తోందని తెలిపారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ %ఙూజ% జారీపై కేంద్రం జోక్యం అవసరమని అభిప్రాయపడ్డారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులపై కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు. మిషన్ కాకతీయ, చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యామ్‌ల ద్వారా సాగునీటి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయని చెప్పారు. వరద జలాల వినియోగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు 1 టీఎంసీ నీరు ఎత్తిపోసే ప్రణాళికకు అనుమతులు ఇంకా లభించలేదని అన్నారు.

గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం అవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు తక్షణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరారు.





T. HARISH RAO
M.L.A.,
33-Siddipet Assembly Constituency

Camp Office :
H.No. 18-1924, Prashanthnagar,
Siddipet Town and District.
Cell : 084572 22222

Hyderabad Office :
Villa No. 1025, Krinss Villas, Puppalaguda
Financial District, Hyderabad.
Contact No. 040-23114222
Cell : 94404 71409

గౌరవనీయులు శ్రీ కిషన్ రెడ్డి గారు,
కేంద్ర బొగ్గు & గనుల శాఖామాత్యులు

నమస్కారం
తెలంగాణ రాష్ట్రం నుంచి సికింద్రాబాద్ లోక్ సభ సభ్యునిగా, కేంద్ర క్యాబినెట్ మంత్రిగా రెండవసారి పని చేస్తున్నందుకు అబినందనలు. కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగానికి సాధించవలసిన కొన్ని అంశాలను మీ దృష్టికి తీసుకురావాలని తలచి ఈ లేఖ రాస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి – బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు 80 వేల కోట్ల రూపాయలతో చేపట్టి 200 టిఎంసిల గోదావరి నీటిని బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్ ద్వారా పెన్నా బేసిన్ కి తరలించాలని తలపోసిన సంగతి, ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు సమకూర్చే విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి రెండు లేఖలు కూడా రాసిన సంగతి మీకు తెలిసే ఉంటుందని ఆశిస్తున్నాను. ప్రాజెక్టు వివరాలు పంపించమని కేంద్ర ప్రభుత్వం గోదావరి బోర్డుకు సూచించినట్టు కూడా పత్రికల్లో వార్తలు వచ్చినాయి. దీన్నిబట్టి చంద్రబాబు నాయుడు గారి లేఖను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టుగా అవగతం అవుతున్నది. గోదావరి నదీ జలాల్లో తెలంగాణ నీటి హక్కులకు ఈ ప్రాజెక్టు వలన భంగం వాటిల్లనుందని సాగునీటి రంగ నిపుణులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం – 2014 ప్రకారం కొత్త ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు గోదావరి / కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు గాని, బోర్డులకు గాని సమాచారం

1

# యూజీసీ మార్గదర్శకాలపై స్పందించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి



వైస్ చాన్సెలర్ల నియామకంలో యూజీసీ మార్గదర్శకాలపై తెలంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి స్పందించారు. మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. వీసీలుగా బ్యూరోక్రాట్స్‌ను నియమించాలనుకోవడం ఏమాత్రం సరికాదన్నారు. యూజీసీ గైడ్‌లైన్స్ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయన్నారు. యూజీసీ మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. రాష్ట్రాల యూనివర్సిటీలను దెబ్బతీసేలా కేంద్రం నిర్ణయాలున్నాయని విమర్శించారు. యూనివర్సిటీలు స్వతంత్రంగా ఉండాలన్న ఆయన.. ఈ అంశంపై ఓ కమిటీని వేసినట్లు తెలిపారు. కమిటీ ఇచ్చే నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఖాళీల భర్తీపై త్వరలో ప్రభుత్వ నివేదిక చైర్మన్ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఉన్నత విద్యాసంస్థల్లో ప్రొఫెసర్లుగా పదేళ్ల అనుభవం, పాలనా సామర్థ్యంతో పాటు విషయ పరిజ్ఞానం తదితర అర్హతలు ఉన్న వారిని వీసీలుగా నియమిస్తూ వస్తున్నారు. రాష్ట్రాల గవర్నర్లు వీసీల నియామకానికి మొదట నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. అన్ని కోణాల్లో అధ్యయనం చేసి ముగ్గుర్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత వివరాలను రాజ్‌భవన్‌కు పంపిస్తారు. వారిని గవర్నర్ పిలిపించి మాట్లాడి.. ఒకరిని వీసీగా నియమిస్తారు. వీసీగా ఎంపికైతే నాలుగేళ్లు విధులు నిర్వర్తిస్తారు.

యూజీసీ జారీ చేసిన కొత్త మార్గదర్శకాల మేరకు.. భవిష్యత్‌లో కార్పొరేట్ సంస్థల్లో విధులు నిర్వర్తించిన ఎగ్జిక్యూటివ్స్, సాంకేతిక నిపుణులు, బ్యూరోక్రాట్స్, ఎన్‌ఐటీ, ఐఐటీల్లో అధికారులుగా ఉన్న వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. యూజీసీ మార్గదర్శకాలపై పలువురు విద్యావేత్తలు విమర్శలు గుర్పించారు. వీసీల పాత్ర భిన్నంగా ఉంటుందని.. విద్యాప్రమాణాలు, క్రమశిక్షణ, కళాశాలల అవసరాలు, పాఠ్యాంశాల పరిశీలన, పరీక్షల నిర్వహణ, పరిశోధనలపై దృష్టి పెడతారని.. కార్పొరేట్, ఇతర అధికారులు అవన్నీ చేయడం సాధ్యం కాదన్నారు. అవగాహన లేని వ్యక్తులను వీసీలుగా నియమిస్తే విద్యా ప్రమాణాలు దిగజారే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఆర్ సి హెచ్ పి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

## ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జనవరి 27(క్రాంతి న్యూస్): కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం డి రజాక్ ఆర్ సి హెచ్ పి కి విచ్చేసి ఆక్కడున్న సమస్యల ను కార్మికులను కలిసి తెలుసుకున్నారు. ఈ సమస్యల మీద రేపు ఆర్ సి హెచ్ పి, హెచ్ ఓ డి ని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాలను రేపు అందజేస్తానని కార్మికులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ శంకర్ బాబు, సేఫ్టీ కమిటీ మెంబర్స్ ఒమేశ్, దాసరి శ్రీనివాస్, గజ్జి శ్రీనివాస్, అనిల్ కుమార్, రోశయ్య, శ్రీనివాస రెడ్డి , కుమార్, మరియు ఎలక్ట్రికల్ మెకానికల్ ఫోర్ మెన్స్ తదితరులను కలుసుకున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ములుగు/ క్రాంతి న్యూస్: పెండింగ్ లో ఉన్న ప్రజావాణి అర్జీలను వచ్చే వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 38 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను అయన ఆదేశించారు.ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 38 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 08 గృహ నిర్మాణ శాఖకు 07, పెన్షన్ 01, ఉపాధి కల్పనకు 02 ఇతర శాఖలకు సంబంధించినవి 20 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ

జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మరియు నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములైన గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలను అభినందనియమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపికకై ఈ నెల 16 నుండి 20 వ తేదీ వరకు క్షేత్రస్థాయి విచారణ, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహణలో ప్రజల సహకారం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఆశయం మేరకు ప్రతి ఒక్కరి ఉద్యోగి కృషి ప్రశంసనీయమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందించడంలో స్ఫూర్తితో పనిచేయాలని ఆయన సూచించారు. సంక్షేమ కార్యక్రమాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతరం ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేయుటలో ఒక టీముగా

ప్రతి ఒక్కరు ఐకమత్యంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఉద్యోగి సేవాకాలంలో పేదలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, అదే ప్రతి ఉద్యోగికి ఆశీర్వాదమని తెలిపారు. ఫిబ్రవరి 12 నుండి 15 వరకు జరిగే

శ్రీ సమ్మక్క సారలమ్మ చిన్న జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసి జాతర విజయవంతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రైవేట్ ఆసుపత్రులలో తనిఖీలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 27 (క్రాంతి న్యూస్):సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. మురళిధర్ మరియు ప్రోగ్రాం అధికారిడాక్టర్ సారంగం ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ సత్య సాయి హాస్పిటల్, నిఖ్మ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ హాస్పిటల్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి హాస్పిటల్ లో వారు అంధించే సేవలకు తీసుకునే రుసుముల పట్టికను అందరికీ తెలిసే విదముగా ప్రదర్శించ లేనందులకు అంతేకాకుండా ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రముగా వుండడం మూలముగా, ఆసుపత్రి యజమాన్యం పైన ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తు నోటీసులు ఇవ్వడం జరిగింది. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, యాజమాన్యాలు విధిగా దరల పట్టికను ప్రదర్శించాలని, బయో మెడికల్ వేస్ట్ సర్టిఫికేట్, పొల్యూషన్ సర్టిఫికేట్ లు, ఆసుపత్రి లో పనిచేసే డాక్టర్ల పేర్లను బోర్డు పైన ప్రదర్శించాలని, సిబ్బందికి సంభందిచిన సర్టిఫికట్ లను విధిగా తనిఖీ అధికారులకు చూపించాలని, ఫైర్ సేఫ్టీ మెసర్స్ కు సంభందించిన పరికరాలను అమర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. నిఖ్మా హెల్త్ కేర్ ఆసుపత్రి లో రికార్డుల నిర్వహణ సరిగా లేనందున నోటీస్ లు జారీ చేశారు.


స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ, మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమని పేర్కొంటూ అన్ని స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసే గదిలో మరియు వేచియుండు హాలులో తప్పకుండా ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు అనే బోర్డులు, పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఫామ్ -F ఏ రోజువి ఆ రోజే ఆన్లైన్ చేయాలని, ఆన్లైన్ చేసిన అన్ని ఫారం-F లు ప్రతినెల 5వ తారీఖు లోపు జిల్లా వైద్య' ఆరోగ్య శాఖా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

ఈ తనికీలలో వైద్యాధికారి వెంట ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రవణ్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకులు కె.వి. రాజు, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ

## అమలు అప్పుడే.. తేల్చేసిన చంద్రబాబు!



అమరావతి , 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీ ఆర్థిక పరిస్థితిపై నీతి ఆయోగ్ నివేదిక విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ నివేదికపై సీఎం నారా చంద్రబాబు నాయుడు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నీతి ఆయోగ్ నివేదికలో వైసీపీ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై క్లారిటీ ఇచ్చారని చంద్రబాబు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలను కూడా తాకట్టుపెట్టిందన్న చంద్రబాబు.. వైసీపీ పాలన వల్ల ఏపీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బీహార్ కంటే దిగజారిందని ఆరోపించారు. అప్పులు చేసి తిరిగి చెల్లించే శక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లేదని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని తిరిగి గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నామన్న చంద్రబాబు... రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలియాలనే విలేకర్ల సమావేశం పెట్టినట్లు చెప్పారు. కేంద్రం నుంచి ఏపీ రాజధాని అమరావతికి రూ.15000 కోట్లు, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు రూ.12,750 కోట్లు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు రూ.11,114 కోట్లు సహకారం అందిందన్న చంద్రబాబు.. అయితే ఆ నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించలేనని అన్నారు. ఆయా ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని.. వాటి ద్వారా సంపద సృష్టికి అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న చంద్రబాబు.. ఆర్థిక పరిస్థితి కొంచెం మెరుగవ్వగానే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తామన్నారు.

గత ఐదేళ్లలో ఏపీ ఆర్థిక పరిస్థితి ఘోరంగా దెబ్బతిందన్న చంద్రబాబు.. అయితే ఆ నష్టంతో తనకు ఏం సంబంధమని సామాన్య ప్రజలు ఆలోచించే అవకాశం ఉందన్నారు. అలా ఆలోచించడంలో తప్పు లేదని.. అందుకే, మాట తప్పడం ఇష్టం లేక ప్రజలకు నిజాలు చెప్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకుంటే అభివృద్ధి పనులు చేయలేమని.. అభివృద్ధి పనుల వల్లే సంపద పెరుగుతుందని చంద్రబాబు చెప్పారు. అయితే అప్పులు చేయడం సరికాదన్న చంద్రబాబు.. తీర్చగల శక్తి ఉన్నప్పుడే అప్పులు చేయాలన్నారు. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి సమయం కావాలని.. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని చంద్రబాబు కోరారు. అయితే సంక్షేమ పథకాల అమల్లో వెనకడుగు వేసే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.



# పచ్చని పల్లెటూరును భయపెట్టిన ఎర్ర జాకెట్లు..

## అసలక్కడ ఏం జరిగిందీ?



అమరావతి , 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): పచ్చని కొండల మధ్య అదో చక్కని పల్లెటూరు. గ్రామ మొత్తం లెక్కిస్తే ఓ 50 ఇల్లు కూడా ఉండవు. ఉదయాన్నే లేవటం, పొలం పనులకు వెళ్లడం ఇదే వారి రొటీన్ లైఫ్. ఉదయాన్నే పొలాలకు వెళ్లి సాయంత్రానికి తిరిగి రావటం.. కాసేపు ముచ్చట్లు, ఆ తర్వాత ఉన్నదేదో తినడం.. నలుగురితో నాలుగు మాటలు చెప్పుకుని నిద్రపోవటం.. ఇదీ ఆ ఊరిజనాల నిత్యకృత్యం. అయితే అలాంటి ఊరిని ఓ ఘటన భయపెట్టింది. ఊరి జనాలను ఉలిక్కిపడేలా చేసింది. పొలం పనులు చేసుకుంటూ హాయిగా గడుపుతున్న ఆ ఊరిజనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

### ఏంటా ఘటన.. ఎందుకా భయం?

సాధారణానికి కాస్త భిన్నంగా జరిగేది ఏదైనా అసాధారణమే. ఆ అసాధారణ ఘటనలు కొన్నిసార్లు అద్భుతమనిపిస్తాయి. కొన్నిసార్లు అరుదుగా అనిపిస్తాయి. కొన్నిసార్లు అమ్మబాబోయ్ అనేలా చేస్తాయి. జరిగే ఘటనలు మంచివైతే అద్భుతాలు.. చెడు విషయాలకు సంబంధించినవి అయితే.. భయానకాలు. అలాంటి పరిస్థితే ఆ ఊరిజనాలకు ఎదురైంది. ఆ ఊరు పేరు వెంకటాయపాలెం. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం పరిధిలో ఉంటుంది. పులిచింతల ప్రాజెక్టు సమీపంలో ఉంటుందీ ఊరు. పొలం పనులు చేసుకుంటూ జీవించే ఈ ఊరి జనాలకు సోమవారం వింత అనుభవం ఎదురైంది.

రోజూ మాదిరిగానే సోమవారం తెల్లవారింది. కొక్కొరోకో అనే కోడికూతతో వెంకటాయపాలెం ఎస్సీ కాలనీ నిద్రలేచింది. ఇంటి ముందు కళ్లాపి చల్లడానికి అమ్మలక్కలు, పొలం పనులకు వెళ్లడానికి రైతన్నలు బయల్దేరారు. కానీ ఇంటి తలుపు తీయగానే.. వారందరూ ఊహించని ఘటన జరిగింది. ఎవరు చేశారో, ఎందుకు చేశారో తెలియదు కానీ.. తెల్లవారేసరికి ఇంటి ముందు ఎర్రజాకెట్లు, నిమ్మకాయలు, మిరపకాయలు, పసుపు కుంకుమ దర్శనమిచ్చాయి. ఎర్ర జాకెట్ ముక్కలో మిరప కాయలు, నిమ్మకాయలు, బూడిద ప్యాకెట్, ముగ్గు కనిపించాయి. ఇలా ఒకచోట కాదు.. ఏకంగా 12 ఇళ్లముందు ఇలాంటి దృశ్యమే కనిపించింది. దీంతో ఊరి జనం భయపడిపోయారు. గ్రామంలో ఒక రకమైన అలజడి ప్రారంభమైంది. స్థానికుల్లో భయాందోళనలు నెలకొంది.

గ్రామంలో క్షుద్రపూజలు జరిగాయనే భయంతో ఊరిజనం హడలిపోయారు. వెంటనే కొంతమంది స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కూడా గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాలను పరిశీలించారు. జాకెట్ ముక్క, అందులో ఉన్న వస్తువులను పరిశీలించి ఫోటోలు తీసుకుని వెళ్లారు. అయితే ఈ ఘటన స్థానికులకు కలవరపెడుతోంది. నిజంగానే క్షుద్రపూజలు చేశారా.. లేదా, ఎవరైనా ఆకతాయిల పనా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలోపే ఊరి జనం కూడా గ్రామ ఆలయంలో ప్రమాణాలు చేసేందుకు సిద్ధమయ్యారు. మొత్తంగా ప్రశాంతంగా ఉన్న పల్లెలో.. ఈ ఎర్ర జాకెట్లు, నిమ్మకాయలు కలకలం రేపాయి.

# ఆటోమేటిక్‌గా రీఫండ్ కానీ అమెజాన్ గిఫ్ట్ కార్డ్ మనీ

అమరావతి , 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): ప్రస్తుతం ప్రతి ఒక్కరూ క్రెడిట్ కార్డులు వాడుతున్నారు. ఇప్పుడు ప్రతి విషయంలో డిజిటల్ చెల్లింపులు ఎక్కువయ్యాయి. ఆన్ లైన్ కొనుగోళ్లు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ-కామర్స్ సంస్థలు గిఫ్ట్ కార్డులు జారీ చేస్తుంటాయి. ఆయా గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేసిన కస్టమర్లకు వాటి ఎక్స్‌పైరీ డేట్ అయిపోయినా వాటిల్లో ఉన్న మనీ రీఫండ్ చేయడం లేదు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కస్టమర్లకు సరళతరమైన సేవలందించేందుకు పారదర్శకత పాటిస్తూ న్యాయంగా వ్యవహరించడమే ప్రాధాన్యాలు కావాలని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌కు సూచించారు. 'సాధారణంగా అమెజాన్ గిఫ్ట్ కార్డ్‌లో మనీ డిపాజిట్ చేయడం నేరుగా చేసేయొచ్చు. అలాగే ఆ గిఫ్ట్ కార్డు టైం ఎక్స్‌పైరీ అయిపోయాక అలాగే మనీ రీఫండ్ కావడం లేదు. మామూలుగానైతే ఆన్‌లైన్‌లో కార్డ్ నంబర్ నమోదు చేస్తే లావాదేవీలు పూర్తవుతాయి. కానీ అలా జరక్కపోగా తప్పనిసరి పరిస్థితుల్లో కస్టమర్ సర్వీస్‌ను సంప్రదించి.. ప్రక్రియ పూర్తి చేయడానికి చాలా సమయం తీసుకోవాల్సి వస్తోంది'అని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు. ఈ పోస్టుకు ఈ-కామర్స్ జెయింట్ అమెజాన్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐని ట్యాగ్ చేశారు.



# రోజాకు మంత్రి నారా లోకేష్ కౌంటర్..

## దావోస్‌కు, జ్యూరిక్‌కు తెలియదంటూ సెటైర్లు



అమరావతి , 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): దావోస్‌లోనూ రెడ్ బుక్ గురించి మాట్లాడారంటూ మాజీ మంత్రి, వైసీపీ అధికార ప్రతినిధి రోజా చేసిన విమర్శలకు.. ఏపీ మంత్రి నారా లోకేష్ కౌంటరిచ్చారు. జ్యూరిక్‌లో తాము దిగిన రోజున అక్కడున్నవారు చంద్రబాబును కలవాలని కోరినట్లు నారా లోకేష్ చెప్పారు. దీంతో జ్యూరిక్‌లో 700 మందితో మీటింగ్ పెట్టామని.. అక్కడ ఓ వ్యక్తి రెడ్ బుక్ గురించి మాట్లాడాలని కోరినప్పుడు.. తాను రెడ్ బుక్ గురించి మాట్లాడినట్లు నారా లోకేష్ క్లారిటీ ఇచ్చారు. పరువు నష్టం కేసులో నారా లోకేష్ సోమవారం విశాఖపట్నం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగానే చంద్రబాబు దావోస్ పర్యటనపై వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలకు నారా లోకేష్ కౌంటర్ ఇచ్చారు. దావోస్ పర్యటన ద్వారా పక్క రాష్ట్రాలు వేలకోట్లు పెట్టుబడులు తీసుకువస్తే.. చంద్రబాబు బృందం ఖాళీ చేతులతో రాష్ట్రానికి తిరిగి వచ్చిందని రోజా విమర్శించారు. ఈ నేపథ్యంలో రోజా విమర్శలపై నారా లోకేష్ స్పందించారు. మాజీ మంత్రి రోజాకు దావోస్‌కు, జ్యూరిక్‌కు తేడా తెలియదంటూ మంత్రి నారా లోకేష్ సెటైర్లు వేశారు. రోజాకు వాటిపై అవగాహన లేదన్నారు. జ్యూరిక్‌లోనూ ఓ వ్యక్తి కోరిన కారణంగానే రెడ్ బుక్ గురించి మాట్లాడానన్న లోకేష్.. రెడ్ బుక్ అంటే వైసీపీకి ఎందుకంత భయమని ప్రశ్నించారు.

ఏ అధికారులు అయితే చట్టాన్ని ఉల్లంఘించి, ప్రజలను, తెలుగుదేశం పార్టీ నాయకులను వేధించారో వారిని వదిలే ప్రసక్తేలేదని నారా లోకేష్ స్పష్టం చేశారు. చట్టాలను ఉల్లంఘించనప్పుడు మీకెందుకు భయమని ప్రశ్నించారు. రాజకీయాలలో పాదయాత్ర ఎంబీఏ లాంటిదన్న నారా లోకేష్.. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుందన్న నారా లోకేష్... అన్ని వ్యవహారాలపై విచారణ ఒకేసారి జరిగితే ఉన్న పోలీసులు సరిపోరని అన్నారు. అన్ని అక్రమాలపైనా విచారణ జరుపుతామని స్పష్టం చేశారు.

మరోవైపు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడు నెలలలో ఆరు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చామనీ, ఆరు లక్షల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు తెచ్చామని నారా లోకేష్ అన్నారు. గత ప్రభుత్వంలో ఒప్పందాలు జరిగితే ఎందుకు పరిశ్రమలు స్థాపించలేకపోయారని ప్రశ్నించారు. దావోస్‌లో మహారాష్ట్రకు ఎక్కువ పెట్టుబడులు రావటానికి ఒకే ప్రభుత్వం కొనసాగడం కారణమని నారా లోకేష్ అభిప్రాయపడ్డారు.

# ఏపీలోని పేదలకు శుభవార్త..

## ఇంటి స్థలాల పంపిణీ.. అర్హతలు, నిబంధనలివే..

అమరావతి , 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): ఇళ్ల స్థలాల పంపిణీపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందరికీ ఇళ్లు పథకం పేరుతో తాజాగా ఏపీ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. అందరికీ ఇళ్లు పథకం కింద గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనున్నారు. అయితే ఈ పథకం అర్హతలను ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున స్థలం ఇస్తామని హామీ ఇచ్చింది. ఇక ఇచ్చిన మాట ప్రకారం ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. అందరికీ ఇళ్లు పథకం పేరుతో అర్హతలు పేర్కొంటూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీవో జారీ చేశారు.

ఈ జీవో ప్రకారం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలాన్ని మహిళల పేరుతో ప్రభుత్వం పంపిణీ చేయనుంది. అలాగే ఏజెన్సీల ద్వారా ఈ స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇక ఇంటి పట్టా ఇచ్చిన రెండేళ్లలో అక్కడ ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారికి మాత్రమే ఇంటి స్థలం కేటాయిస్తారు. ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇవ్వనుంది. ఇంటి స్థలం పట్టా పొందిన వారికి పదేళ్ల తరువాతనే ఆ స్థలంపై పూర్తి హక్కులు లభిస్తాయి. ఆ మేరకు పదేళ్ల కాలపరిమితితో ఫ్రీహోల్డ్ హక్కులు ఇచ్చేలా కన్వేయన్స్ డీడ్ జారీచేస్తారు.

మరోవైపు ఒక్కసారి మాత్రమే ప్రభుత్వం నుంచి ఉచిత ఇంటి స్థలం పొందేలా అందరికీ ఇళ్లు పథకంలో విధి విధానాలు రూపొందించారు. అలాగే ఈ పథకం కింద లబ్ధిపొందే వారికి రాష్ట్రంలో ఎక్కడా ఇంటిస్థలం ఉండకూడదు. అలాగే సొంత ఇల్లు కూడా ఉండకూడదని ప్రభుత్వం షరతులు, నిబంధనలు విధించింది. అలాగే గతంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర గృహనిర్మాణ పథకాల్లోనూ లబ్ధిదారుగా ఉండకూడదని జీవోలో ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ పథకం కింద లబ్ధిపొందాలంటే రేషన్ కార్డు కలిగి ఉండాలి, 5 ఎకరాల్లోపే మెట్ట, 2.5 ఎకరాల్లోపు మాగాణి ఉండాలి. ఇళ్ల స్థలాల కోసం త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తారు. రెవెన్యూ సిబ్బందితో విచారణ, గ్రామ, వార్డు సభల్లో అభ్యంతరాల స్వీకరణ తర్వాత అర్హులను నిర్ణయిస్తారు. ఇక ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత ఇళ్ల స్థలాన్ని ఆధార్, రేషన్ కార్డులకు అనుసంధానం చేయనున్నారు. మరోవైపు ఇంటి పట్టాల పంపిణీ కోసం ఉన్న భూమినే వినియోగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. కొత్తగా భూములను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న భూమిలోనే అర్హులకు పట్టాలు పంపిణీ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.



# నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి....!

**పిఆర్టియు ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతి పత్రం...**



చిట్యాల, జనవరి 27 (క్రాంతి న్యూస్): కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ కు బదులుగా ప్రవేశపెట్టిన యునైటెడ్ పెన్షన్ స్కీమ్ యూపీఎస్ (గెజిట్ విడుదల చేసింది) విధానాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం రోజున భోజన విరామ సమయంలో రేగొండ మండల పిఆర్టి యు శాఖ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్ లో చేరొద్దని ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఓపిఎస్ ఇవ్వాలని వినతి పత్రం తో కోరుతూ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయులు తాసిల్దార్ లయానికి తరలి వెళ్లి ఎమ్మార్వో శ్వేతకు అందజేశారు. ఈ కార్యక్రమములో రేగొండ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుస్స సధాకర్, కె. మధుకర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి. సతీష్, కె. సాంభశివుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎండి. రంజాన్, ఉపాధ్యక్షులు జి. రవీందర్, శివప్రసాద్, జి. రమేశ్,మండల అసోసియేట్ అధ్యక్షులు, పి. శ్యాంసుందర్ రెడ్డి, డి. శ్రీలత, పి. రాధాకృష్ణ, ఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదు

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి27(క్రాంతి న్యూస్): జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు సోమవారం జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.నిషేధిత గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమరవాణా, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాధితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను



ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా విధుల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు మరియు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ ఐపిఎస్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని సిఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నేతకాని కుల సంఘం భవనం నిర్మించి ఇవ్వాలని ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించిన మార్షల్ దుర్గం నగేష్



క్రాంతి న్యూస్ రామగుండం, జనవరి 27: నేతకాని కులస్తులకు రెండు ఎకరాల స్థలంలో నేతకాని సంక్షేమ భవనం నిర్మించి ఇవ్వాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నేతకాని కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ నేతకాని సమాజం రామగుండం కార్పొరేషన్ పరిధిలో పదివేల మందికి పైగా ఉన్నారని, ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందలేదని తెలిపారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేతకాని కులస్తులకు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రజాసంఘాల కార్యక్రమాల్లో నేతకాని కులస్తులను కూడా భాగస్వాములు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని కులాలకు సంక్షేమ భవనాలు నిర్మించి ఇచ్చినట్లే నేతకాని కులానికి కూడా సంక్షేమ భవనం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, నేతకాని సంఘం పెద్దపల్లి జిల్లా నాయకులు కుమ్మరి మల్లేష్, కామెర పద్మ, దుర్గం చిన్నక్క, మాదాసు సుధాకర్, బండారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జనవరి 27(క్రాంతి న్యూస్): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జనవరి 29 నుండి ఫిబ్రవరి 22 వరకు జరిగే ప్రాక్టికల్ పరీక్షలు మరియు మార్చి 5 నుంచి 25 వరకు జరిగే పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం



లో 10173 మంది రెండవ సంవత్సరం 10,062 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో 65 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 వరకు మరియు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు రెండు సెక్షన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, మెడికల్ శిబిరాలు, ఆర్టీసీ బస్ సౌకర్యాలు కల్పించాలని అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో 144 సెక్షన్ అమలు తప్పక ఉండాలని , కేంద్రాల దగ్గరలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని సూచించారు. ఏ ఒక్క కేంద్రంలో సెల్ ఫోన్ అనుమతించ వద్దని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు మానసిక వికాస తరగతులను నిర్వహించి వారిలో పరీక్షల పట్ల ఉన్న భయాందోళన తొలగించాలని అన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించి నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్. వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఏ ఆర్ డి ఎస్ పి సత్యనారాయణ ,టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి , ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ అరవింద్ బాబు, జిల్లా అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యూపీఎస్ లో రాష్ట్ర ప్రభుత్వం చేరొద్దు.....!

## పీఆర్టీటియూ టీఎస్ టీఎస్ మండల అధ్యక్షుడు పోలు నాగరాజు..



చిట్యాల ,జనవరి 27 (క్రాంతి న్యూస్): కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ కు బదులుగా యూపీఎస్ (యునైటెడ్ పెన్షన్ స్కీమ్) కోసం గెజిట్ విడుదల చేసిందని, ఈ యూపీఎస్ గెజిట్ ను పూర్తిగా వ్యతిరేకిస్తూ.. సోమవారం రోజున విరామ సమయంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలు నాగరాజు, గడ్డం అనిల్ కుమార్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్ లో చేరొద్దని, పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ తహసిల్దార్ జాలీ సునీతకు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బి కుమారస్వామి, మండల అసోసియేట్ అధ్యక్షులు ఎన్ రవీందర్, మండల కార్యదర్శి జి చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ జిల్లా అధ్యక్షులు గొర్రె విజయ్, ఉపాధ్యాయులు భాస్కర్, సురేందర్, రాజు, రాము రాజ్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా సిద్దిపేట అడిషనల్ కలెక్టర్




హుస్నాబాద్ జనవరి 27 (క్రాంతి న్యూస్): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పురపాలక సంఘ పాలకవర్గం గడువు జనవరి 26 తో ముగిసిపోవడంతో సోమవారం నుండి హుస్నాబాద్ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ గా సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్ ని నియమించినట్లు తెలంగాణ మున్సిపల్ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టీ మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ నూతన పాలకవర్గం ఏర్పడేవరకు స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగుతుందన్నారు.

# చీమకుర్తి నాగేశ్వరరావు సంస్మరణ సభ...

నెల్లూరు, జనవరి 27 (క్రాంతి న్యూస్): నెల్లూరు నగరంలోని స్థానిక స్వతంత్ర పార్కు నందు సింహపురి పద్య నాటిక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సింహపురి పద్య నాటక కళాకారుల సంస్మరణ సభను 25 కళా సంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు, ఈ సందర్భంగా చీమకుర్తి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం కళాకారులకు గుర్తింపు కార్డులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు జిల్లా వ్యాప్తంగా 270 కళాకారులకు గుర్తింపు కార్డులను అందజేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న పద్య నాటక కళను ఆదరించాలని, కళా రంగానికి తమ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని కళాకారులు తయారు చేసుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, నెల్లూరు జిల్లాకు చెందిన పద్య నాటక కళాకారులు చే బాలనాగమ్మ సత్య హరిశ్చంద్రుడు నాటక ప్రదర్శనను ప్రదర్శించారు....

# ఆరోగ్య క్రాంతి



## మహిళలకు మాత్రమే.. ఈ ఆహారాలను తినండి.. యవ్వనంగా కనిపిస్తారు..

హెల్త్ న్యూస్: ప్రస్తుత తరుణంలో మహిళలు నిత్యం ఎంతటి ఒత్తిడిని అనుభవిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇంటి పనులు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో వారు సతమతం అవుతున్నారు. ఇంట్లోని అందరి ఆరోగ్యం, బాగోగులను వారు చూస్తారు. కానీ తమ ఆరోగ్యం గురించి తామే పట్టించుకోరు. ఇక పనిచేసే మహిళలు అయితే ఓ వైపు కుటుంబాన్ని, మరోవైపు పని ఒత్తిడిని ఎదుర్కొంటూ అవస్థలు పడుతుంటారు. ఇలా ఒత్తిడి బారిన పడుతున్న మహిళలు చాలా త్వరగా వృద్ధాప్యంలోకి వచ్చేసినట్లు కనిపిస్తారు. 30 లేదా 40 ఏళ్ల వయస్సులోనే వృద్ధులు అయిపోయినట్లు కనిపిస్తారు. అయితే కొన్ని రకాల ఆహారాలను తరచూ తీసుకుంటే ఒత్తిడి తగ్గడంతోపాటు చర్మం యవ్వనంగా కనిపించేలా చేయవచ్చు. దీంతో వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. వయస్సు మీద పడినా కూడా యవ్వనంగానే కనిపిస్తారు. ఇక మహిళలు యవ్వనంగా కనిపించాలంటే తీసుకోవాల్సిన ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



**పాలు, పెరుగు :**

మహిళలు రోజూ పాలను తాగుతుండాలి. పాలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అయితే కొవ్వు శాతం తక్కువగా ఉండే పాలనే తాగాల్సి ఉంటుంది. పాలలో ఎముకలను బలంగా ఉంచే క్యాల్షియం, విటమిన్ డి, విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి స్త్రీలకు పోషణను అందిస్తాయి. చర్మాన్ని సంరక్షిస్తాయి. చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. అలాగే కొవ్వు తక్కువగా ఉండే పెరుగును కూడా స్త్రీలు తీసుకోవాలి. ఇది చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. ఇలాంటి పెరుగును తింటే రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని పరిశోధకులు చెబుతున్నారు. కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలతో బాధపడేవారికి కూడా పెరుగు ఎంతగానో మేలు చేస్తుంది. స్త్రీలకు వచ్చే కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు, అల్సర్లను కూడా పెరుగు తగ్గిస్తుంది. చర్మాన్ని సంరక్షించడంతోపాటు యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

**టమాటా, సోయా :**

స్త్రీలకు టమాటాలు ఔషధంతో సమానం అనే చెప్పాలి. ఎందుకంటే వీటిల్లో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగిస్తుంది. ఈ విషయాన్ని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలే వెల్లడిస్తున్నాయి. టమాటాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మహిళల్లో వచ్చే గుండె జబ్బుల ప్రమాదాన్ని సైతం తగ్గిస్తాయి. టమాటాలను తరచూ తినడం వల్ల ఎంత వయస్సు వచ్చినా కూడా యవ్వనంగానే కనిపిస్తారు. ఎందుకంటే ఇవి చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. పోషకాలు పుష్కలంగా ఉండే సోయాను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. సోయాలో విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి స్త్రీలను అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి.

### డ్రై ఫ్రూట్స్, బెర్రీలు..

రోజూ గుప్పెడు డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల శరీరానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలు లభిస్తాయి. అందుకే వీటిని స్త్రీలు తప్పకుండా తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో విటమిన్ బి12, విటమిన్ ఇ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. రోజూ డ్రై ఫ్రూట్స్‌ను తింటే బలంగా ఉంటారు. బ్లూబెర్రీలు, బ్లాక్ బెర్రీలు, రాస్ప్ బెర్రీలు, స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలను రోజూ తింటే స్త్రీలు ఎలాంటి రోగాల బారిన పడే అవకాశమే రాదంటారు నిపుణులు. ఎందుకంటే వీఇలో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల పెద్ద పేగు క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. ఎందుకంటే వీటిలో క్యాన్సర్‌తో పోరాడే ఔషధ గుణాలు ఉంటాయి. ఇలా పలు రకాల ఆహారాలను మహిళలు తీసుకోవడం వల్ల అనేక పోషకాలను పొందడంతోపాటు చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచుకోవచ్చు. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

## రోజుకు అసలు ఎన్ని కోడిగుడ్లను తింటే మంచిది..?

హెల్త్ న్యూస్: మనం ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు ఆరోగ్యకరమైన ఆహారాలను తినాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ నేటి ఉరుకుల పరుగుల బిజీ యుగంలో చాలా మంది జంక్ ఫుడ్‌కు అలవాటు పడ్డారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మొదలుకొని రాత్రి తినే డిన్నర్ వరకు జంక్ ఫుడ్‌నే ఎక్కువగా తింటున్నారు. అలాగే వేళ తప్పించి భోజనం చేస్తున్నారు. రాత్రి పూట కూడా ఆలస్యంగా ఆహారం తీసుకుంటున్నారు. ఇదంతా అస్తవ్యస్తమైన జీవనశైలి కిందకు వస్తుంది. దీంతో ఆరోగ్య సమస్యలను చేజేతులా కొని తెచ్చుకుంటున్నారు. అందుకనే ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాలని పోషకాహార నిపుణులతోపాటు ఆరోగ్య నిపుణులు కూడా మనకు సూచిస్తుంటారు. ఇక ఆరోగ్యవంతమైన ఆహారాల విషయానికి వస్తే కోడిగుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు.

### ప్రోటీన్లు అధికం..

రోజుకు కనీసం ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. కోడిగుడ్లలో ప్రోటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఒక కోడిగుడ్డును తింటే మనకు సుమారుగా 6 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. ఇవి కండరాలకు శక్తిని, పోషణను అందిస్తాయి. దీంతో మనం చురుగ్గా ఉంటాం. ఉత్సాహంగా పనిచేస్తాం. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ రూపంలో కోడిగుడ్డును తింటే రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. ఎంత పనిచేసినా అలసిపోకుండా ఉంటారు. అలాగే కోడిగుడ్లలో కోలిన్ అనే పోషక పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది కణాల పనితీరుకు సహకరిస్తుంది. లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. శరీరంలోని కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. కోలిన్ వల్ల శరీరంలో అసిటైల్ కోలిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది మన మెదడు పనితీరుకు, జ్ఞాపకశక్తికి, ఏకాగ్రతకు, కండరాల పనితీరుకు ఎంతగానో సహాయ పడుతుంది. కనుక కోడిగుడ్లను తింటే మెదడును యాక్టివ్ గా ఉంచుకోవచ్చు.



### కంటి చూపు మెరుగు పడుతుంది..

కోడిగుడ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు గుడ్లలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి కళ్లను సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షిస్తాయి. దీంతో కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల కంటి చూపు తగ్గడం అనే సమస్య వస్తుంది. దీన్ని కూడా రాకుండా నివారించవచ్చు. కోడిగుడ్లలో సెలీనియం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా కోడిగుడ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

### ఎన్ని గుడ్లను తినాలి..?

ఇక కోడిగుడ్లను రోజుకు ఎన్ని తినాలి.. అని చాలా మంది సందేహం వ్యక్తం చేస్తుంటారు. ఇందుకు నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారంటే.. ఆరోగ్యవంతమైన వ్యక్తులు రోజుకు 1 నుంచి 2 కోడిగుడ్లను ఉడకబెట్టి తినవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు, కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు గుడ్లను తినాలి. వీరు కోడిగుడ్డు తెల్లసొన మాత్రమే తినాలి. అలాగే శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువగా చేసేవారు రోజుకు 2 నుంచి 4 కోడిగుడ్లను తినవచ్చు. ఇలా కోడిగుడ్లను తింటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# పక్షవాతం వచ్చే ప్రమాదం ఎవరికి ఎక్కువ?


# వచ్చే ముందు కనిపించే లక్షణాలేంటో తెలుసా?

హెల్త్ న్యూస్: ఈ రోజుల్లో బిజీ లైఫ్‌లో ప్రజల జీవనశైలి కూడా వేగంగా మారుతోంది. పెరుగుతున్న పని ఒత్తిడి, తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల ప్రజలు అనేక సమస్యల బారిన పడుతున్నారు. అలాంటి సమస్యల్లో పక్షవాతం ఒకటి. శరీరంలో వృద్ధాప్యం, వ్యాధుల కారణంగా ఎక్కువగా పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. అయితే ప్రస్తుతం యువతలో కూడా ఈ సమస్య పెరుగుతోంది. వృద్ధులలో పక్షవాతం యొక్క పరిస్థితిని చాలా మంది గమనించి ఉంటారు. ఈ వ్యాధిలో శరీరంలోని కొంత భాగం పనిచేయడం మానేస్తుంది. దీన్ని పక్షవాతం అని కూడా అంటారు. పక్షవాతంలో ఒకవైపు చేయి, కాలు, నోరు, కన్ను ప్రభావితమవుతుంది. పక్షవాతం గురించి ముందుగానే ఏమీ తెలియదు, ఇది కేవలం కొన్ని నిమిషాల్లో శరీరంపై ప్రభావం చూపుతుంది. అలాంటి పరిస్థితుల్లో పక్షవాతం వచ్చే ప్రమాదం ఎవరికి ఉంది, లక్షణాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

పక్షవాతాన్ని బ్రెయిన్ స్ట్రోక్ అని కూడా అంటారు. ఈ పరిస్థితిలో, మెదడులోని ఏదైనా భాగం అకస్మాత్తుగా దెబ్బతినడం లేదా రక్త సరఫరా ఆగిపోవడం వల్ల, ఒక వైపున ఉన్న అవయవాలు పనిచేయడం మానేస్తాయి. దీనినే పక్షవాతం అంటారు. చాలా సార్లు, తేలికపాటి స్ట్రోక్ తర్వాత శరీరం యొక్క ఒక వైపు గణనీయమైన బలహీనత ఉంటుంది.

**పక్షవాతం ఎందుకు వస్తుంది?**

సాధారణంగా, పక్షవాతం రావడానికి రెండు కారణాలు ఉన్నాయి. వాటిలో ఒకటి మెదడు రక్తస్రావం, అంటే మెదడుకు వెళ్లే రక్త ప్రసరణలో అడ్డంకులు ఏర్పడటం. రెండవ కారణం మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే పైపులో ఒక రకమైన అడ్డంకి. చాలా సందర్భాలలో, రక్త ప్రసరణలో అడ్డంకుల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. నివేదికల ప్రకారం, 85 శాతం పక్షవాతం కేసులు రక్తాన్ని తీసుకువెళ్లే ధమనుల్లో బ్లాక్ ఏర్పడటం వల్లే సంభవిస్తాయని నిపుణులు చెబుతున్నారు.



**పక్షవాతం వచ్చే ప్రమాదం ఎవరికి ఎక్కువ?**

రక్తపోటు రోగులు, డయాబెటిక్ పేషెంట్లు, పెరిగిన లిపిడ్ ప్రొఫైల్ ఉన్నవారికి పక్షవాతం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. గుండె సమస్యలు, రక్తం గడ్డకట్టడంలో సమస్యలు ఉన్న వారు కూడా డేంజర్‌లో ఉన్నట్టే. ఇలాంటి వారికి కూడా పక్షవాతం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**పక్షవాతం సంకేతాలు ఏమైనా ఉన్నాయా?**

పక్షవాతం వచ్చే ముందు శరీరంలో కనిపించే సంకేతాలు లేవు. చాలా తక్కువ సందర్భాల్లో ముందుగానే గుర్తించవచ్చని వైద్యులు చెబుతున్నారు. రోగి ఏదైనా అర్థం చేసుకోవడానికి లేదా పరిస్థితిని నియంత్రించడానికి అవకాశం రాకముందే ఇది చాలా త్వరగా జరుగుతుందని వైద్యుల అభిప్రాయం.

**ఈ వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలి**


పక్షవాతం ముందుగానే గుర్తించబడదు. కానీ మొదటగా వచ్చిన వారికి చిన్న పక్షవాతం వస్తుంది. ఈ విషయంలో వారు అప్రమత్తంగా ఉండాలి. కొన్నిసార్లు, మాట్లాడటంలో ఇబ్బంది లేదా శరీరంలోని ఒక భాగంలో చాలా తక్కువ వ్యవధిలో బలహీనత ఉంటే, ఇవి తేలికపాటి పక్షవాతం లక్షణాలు కావచ్చు. అయితే.. ఈ పరిస్థితిలో కొంత సమయం తర్వాత రోగి కోలుకుంటారు. వైద్యులు దీనిని [illegible] అని పిలుస్తారు. ఇది పక్షవాత సంకేతంగా పరిగణించబడుతుంది.

**పక్షవాత లక్షణాలు**

సాధారణంగా పక్షవాతం చేతులు, కాళ్లు, నోటిని ప్రభావితం చేస్తుంది. అటువంటి పరిస్థితిలో, ఒక వైపు తీవ్ర ప్రభావం ఉంటుంది. ఒక వైపు శరీర భాగాలు పనిచేయడం మానేస్తాయి. నడవడం, మాట్లాడటం, వ్రాయడం, శరీరాన్ని కదిలించడంలో చాలా ఇబ్బందులు ఉంటాయి. అలాంటి వారికి చాలా బలహీనతలు ఉంటాయి. పక్షవాతం వచ్చే ముందు కంటి చూపు మందగిస్తుంది. పక్షవాతం వచ్చే ముందు నిలబడటం, నడవడంలో ఇబ్బంది పడతారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అలాంటి వ్యక్తుల్ని వైద్యుని వద్దకు తీసుకువెళ్లాలి.

**గమనిక:**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.



# క్రీడలు





## చాంపియన్స్ ట్రోఫీ టికెట్ల విక్రయాలు..! అప్‌డేట్ ఇచ్చిన ఐసీసీ..!




స్పోర్ట్స్ న్యూస్,27 జనవరి ( క్రాంతి న్యూస్

ఈ ఏడాది పాకిస్థాన్, దుబాయి వేదికగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరుగనున్నది. ఫిబ్రవరి 19 నుంచి మినీ వన్డే వరల్డ్ కప్ జరుగనున్నది. ఇక టోర్నీ జరిగే మ్యాచుల టికెట్ల విక్రయాలు జనవరి 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ టికెట్లను విక్రయిస్తారు. పాకిస్థాన్‌లోని వంద అవుట్ లెట్స్‌లో టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొననున్నాయి. ఫిబ్రవరి 19న మొదలై.. మార్చి 9 వరకు కొనసాగుతుంది. చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్నది. అయితే, భారత జట్టును పాకిస్థాన్‌కు పంపేది లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఐసీసీ జోక్యంతో హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ జరగనున్నది. భవిష్యత్‌లో జరిగే ఐసీసీ ఈవెంట్ల సందర్భంగా తాము భారత్‌కు వెళ్లబోమని.. తటస్థ వేదికల్లోనే మ్యాచులు ఆడుతామని స్పష్టం చేసింది. దీనికి బీసీసీఐ, పాకిస్థాన్ ఒప్పుకున్నాయి. దాంతో టీమిండియా మ్యాచులన్నీ దుబాయి వేదికగా జరుగనున్నాయి. మిగతా మ్యాచులన్నీ పాకిస్థాన్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండి నగరాల్లో ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు జరుగుతాయి. 1996 తర్వాత పాకిస్థాన్‌లో తొలిసారిగా ఐసీసీ టోర్నీ జరుగుతున్నది. ఇక రెండో సెమీఫైనల్ సహా ఆ దేశంలో జరిగే పది మ్యాచులకు సంబంధించిన టికెట్ల విక్రయాలు మంగళవారం నుంచి మొదలుకానున్నాయి. అయితే, టీమిండియా మ్యాచులకు సంబంధించిన టికెట్లను మాత్రం విక్రయించబోవడం లేదు. త్వరలోనే టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన వివరాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ టోర్నీలో టీమిండియాతో పాటు ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు గ్రూప్–ఏలో ఉన్నది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ గ్రూప్–బీలో ఉన్నాయి. ప్రతి గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు సెమీఫైనల్‌కు చేరుతాయి. టీమిండియా ఫైనల్‌కు చేరితే.. దుబాయిలోనే ఫైనల్ జరుగుతుంది. లేకపోతే పాక్‌లోనే నిర్వహిస్తారు.

## కాంబ్లీకి విడాకులు ఇవ్వాలనుకున్నా.. భార్య ఆండ్రియా ఇంకేం చెప్పిందంటే



ముంబై , 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ రెండో భార్య ఆండ్రియా హెవిట్ ఓ పెద్ద విషయాన్ని బయటపెట్టింది. 2023లో కాంబ్లీకి విడాకులు ఇచ్చేందుకు సిద్ధపడినట్లు ఆమె వెల్లడించింది. డైవర్స్‌ను ఫైల్ చేసినట్లు పేర్కొన్నది. కానీ కాంబ్లీ నిస్సహాయ స్థితిని చూసి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు ఆమె చెప్పింది. ఇటీవల వాంఖడే స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమానికి కాంబ్లీతో కలిసి ఆమె హాజరైంది. ఆ సమయంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని తెలిపింది.

తాగుడుకు బానిసైన కాంబ్లీ గురించి ఆమె అనేక విషయాలు వెల్లడించింది. ఆల్కహాల్ అడిక్షన్ వల్ల తన రిలేషన్‌కు ఇబ్బంది ఎదురైనట్లు చెప్పిందామె. రెండో భార్య ఆండ్రియాను 2006లో కాంబ్లీ పెళ్లి చేసుకున్నాడు. సివిల్ కోర్టులో జరిగిన ఓ ప్రైవేటు సెర్మనీ ద్వారా వాళ్లు ఒక్కటయ్యారు. అయితే ఇటీవల కాంబ్లీ ఆరోగ్యం మరీ క్షీణించిన విషయం తెలిసిందే. మూత్రకోశ వ్యాధితో బాధపడుతున్న అతన్ని ఆకృతి ఆస్పత్రిలో చేర్పించారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టు సూర్యాంశి పాండేతో జరిపిన పాడ్‌కాస్ట్‌లో ఆండ్రియా తన డైవర్స్ ప్లాన్ గురించి చెప్పింది. కాంబ్లీకి విడాకులు ఇవ్వాలనుకున్నా.. కానీ అతని ఆరోగ్యం గురించి ఎప్పుడూ ఆందోళన ఉండేదన్నారు. ఒకవేళ నేను అతన్ని వదిలివెళ్తే అప్పుడు అతను ఒంటరి అవుతాడని, అతనో చిన్నపిల్లవాడని, అది తనను బాధిస్తోందని, అతని గురించి ఆందోళన చెందాల్సి వస్తోందని, ఓ ఫ్రెండ్‌ను కూడా నేను వదిలేసే వ్యక్తిని కాదు అని, అతను అంతకన్నా ఎక్కువే అని, అతను తిన్నాడో లేదో అని టెన్షన్ పడేదాన్ని అని, ప్రతిక్షణం అతన్ని చెక్ చేయాల్సిన అవసరం వచ్చేదని పేర్కొన్నది.

## స్మృతి మందానాకు ఐసీసీ వన్డే మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు






ముంబై, 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): భారత మహిళా బ్యాటర్ స్మృతి మందానా కు.. 2024 ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. గత ఏడాది వన్డే క్రికెట్‌లో స్మృతి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. 2024లో ఆమె రన్‌మెషీన్‌లా స్కోర్ చేసింది. కేవలం 13 వన్డేల్లో 747 రన్స్ చేసిందామె. భారత జట్టు విజయాల్లో బ్యాటర్ స్మృతి కీలక పాత్ర పోషించింది. జూన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఇండియా 3–0 తేడాతో గెలవడంలో స్మృతి కీలకంగా నిలిచింది. అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో.. తుది వన్డేల్లో సెంచరీతో చెలరేగింది. డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి తన సత్తా చాటిందామె.

మహిళ వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో .. స్మృతి మందానా కొత్త స్టాండర్డ్‌ను నెలకొల్పింది. ఓ క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. 2024లో ఆమె 13 మ్యాచుల్లో 747 రన్స్ చేసింది. దీంతో మహిళల వన్డేల్లో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మందానా.. లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచింది. లౌరా వోల్వార్డ్ 697, టమ్మీ బీమౌంట్ 554, హేలే మాథ్యూస్ 469 రన్స్‌తో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

మందానా 57.86 సగటుతో బ్యాటింగ్ చేసింది. ఆమె స్ట్రయిక్ రేట్ 95.15గా ఉంది. దూకుడు ఆటతీరుతో ఇండియన్ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో ఆమె ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నది. గత ఏడాది స్మృతి మందానా.. నాలుగు వన్డే సెంచరీలు నమోదు చేసింది. మహిళల క్రికెట్‌లో ఇదో కొత్త రికార్డు. 2004లో వన్డేల్లో వందకుపైగా బౌండరీలను బాదింది. వీటిల్లో 95 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి.

## బుమ్రాకు టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు







దుబాయ్, 27 జనవరి ( క్రాంతి న్యూస్ ): పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ను.. ఐసీసీ మెన్స్ టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇవాళ ఆ ప్రటకన చేసింది. స్వదేశీతో పాటు విదేశీ పిచ్‌లపై .. 20204లో బుమ్రా సత్తా చాటాడు. తన స్పీడ్ బౌలింగ్‌తో భారత్‌కు కీలక విజయాలను అందించాడు. 2024లో అతను 13 టెస్టు మ్యాచ్‌లు ఆడి.. 71 వికెట్లను తీసుకున్నాడు. వెన్ను గాయం నుంచి కోలుకుని మళ్లీ టెస్టులు ఆడిన బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 31 ఏళ్ల బుమ్రా గత ఏడాది 14.92 సగటుతో వికెట్లు తీసుకున్నాడు. ఐసీసీ తన ప్రెస్ రిలీజ్‌లో బుమ్రా బౌలింగ్ రికార్డులను విశేషంగా మెచ్చుకున్నది. ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో భారత జట్టు విజయంలో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌ల్లోనూ అతను అత్యధికంగా వికెట్లను తీశాడు.

KR TV క్రాంతి


మంగళవారం 28 జనవరి 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో ట్విస్ట్..!

మూవీడెస్క్,27 జనవరి( క్రాంతి న్యూస్ ): బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకున్నది. ఈ కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ మహిళను ముంబయి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ముంబయిలో గతంలో అరెస్టు చేసిన బంగ్లాదేశ్ జాతీయుడు ఉపయోగించిన సిమ్ సదరు మహిళ పేరుపై ఉందని పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో బెంగాల్‌లోని నదియా జిల్లాలో పోలీసులు సోదాలు నిర్వహించారు.ఆ తర్వాత సదరు మహిళను అరెస్టు చేశారు. ఆదివారం బెంగాల్‌కు చేరుకున్న పోలీసులు.. సోమవారం అరెస్టు చేశారు. ఖుఖుమోని జహంగీర్ షేక్‌గా మహిళను గుర్తించగా.. భారత్‌లోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయుడు షరీఫుల్ ఫకీర్‌తో సంబంధాలు ఉన్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. సైఫ్ అలీఖాన్‌పై ఈ నెల 16న దాడిన జరిగిన విషయం తెలిసిందే. దాంతో ఆయనను కుటుంబీకులు లీలావతి ఆసుపత్రికి తరలించగా.. చికిత్స తీసుకున్నారు. ప్రస్తుతం కోలుకోవడంతో ఆయన ఇంటికి చేరుకున్నారు. సైఫ్ దాడి కేసులో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు.



## ఈ పండగ నుండి రాజుగాడే మన తండేల్..

### నాగచైతన్య ట్రైలర్ ఎలా ఉండబోతుందో చెప్పిన చందూమొండేటి

మూవీడెస్క్,27 జనవరి( క్రాంతి న్యూస్ ):

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్ . రొమాంటిక్ డ్రామా ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో సాయిపల్లవిహీరోయిన్‌గా నటిస్తోంది. చందూమొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.ఈ నేపథ్యంలో మూవీ లవర్స్, అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తండేల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్ శ్రీరామ పిక్చర్ ప్యాలెస్ (రామ టాకీస్ రోడ్) వద్ద నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జనవరి 28 సాయంత్రం 5 గంటల నుంచి ఈవెంట్‌లో ట్రైలర్ లాంచ్ ఉండబోతుందని ప్రకటించారు మేకర్స్. అయితే ట్రైలర్ ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తూ ట్రైలర్ ప్రీల్యూడ్ వదిలారు మేకర్స్.ఈ పండగ నుండి రాజుగాడే మన తండేల్.. అంటూ తండేల్ ట్రైలర్ ప్రీల్యూడ్ లాంచ్ చేశారు మేకర్స్. తండేల్ అంటే రేపు తెలుస్తదని సస్పెన్స్‌లో పెట్టేశారు మేకర్స్. ఇంతకీ తండేల్ అంటే ఏంటనేది తెలియాలంటే ట్రైలర్ (రేపు) వచ్చే దాకా ఆగాల్సిందే మరి.2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా ఇది..



## క్లాప్ బోర్డ్ పట్టుకున్న కాజల్ అగర్వాల్..

### ఏ సినిమా కోసమో తెలుసా మరి..?



మూవీడెస్క్,27 జనవరి( క్రాంతి న్యూస్ ): అందం, అభినయంతోపాటు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో తనకంటూ ప్రత్యేకంగా ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది టాలీవుడ్ కలువ కండ్ల సుందరి కాజల్ అగర్వాల్ . ఈ భామ నెక్ట్స్ కన్నప్పలో కనిపించనుందని తెలిసిందే. కాగా ఈ బ్యూటీ హిందీలో చేస్తున్న ప్రాజెక్ట్ కోసం సెట్స్‌లో జాయిన్ అయిపోయింది. ఇంతకీ ఈ సినిమా ఏంటనే కదా మీ డౌటు.శ్రేయాస్ తల్పడే లీడ్ రోల్‌లో నటిస్తోన్న ది ఇండియా స్టోరీ. ఇందులో కీలక పాత్రలో నటిస్తోంది కాజల్ అగర్వాల్. ఈ మూవీ తొలి షెడ్యూల్ పూణేలో మొదలైంది. ఈ షెడ్యూల్ ఫస్ట్ షూట్‌లో పాల్గొన్న విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అందరితో షేర్ చేసుకుంది కాజల్ అగర్వాల్. బిగ్ స్క్రీన్‌పై ఇదివరకెన్నడూ చెప్పని, ప్రభావవంతమైన కథనంలో భాగమవడం పట్ల ఎక్జయిటింగ్ అవుతున్నట్టు తెలియజేస్తూ క్లాప్ పట్టుకున్న స్టిల్‌ను షేర్ చేసింది.సాగర్ బీ షిండే కథనందించిన ఈ చిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్నాడు. సాగర్ బీ షిండే ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ది ఇండియా స్టోరీ 2025 ఆగస్టు 15న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## ప్రభాస్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

### కల్కి 2898 ఏడీ సీక్వెల్ సెట్స్‌పైకి వెళ్లే టైం చెప్పిన నాగ్ అశ్విన్

మూవీడెస్క్,27 జనవరి( క్రాంతి న్యూస్ ):

ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటించిన సైన్స్ ఫిక్షన్ జోనర్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ వైజయంతీ మూవీస్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించాడు. ప్రపంచవ్యాప్తంగా 2024 జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.1100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. కాగా ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండబోతుందని తెలిసిందే.

మరి పార్ట్ 2 షూటింగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్, ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందించాడు నాగ్ అశ్విన్. ఈ మూవీ షూటింగ్ 2025 మిడ్ జూన్‌లో మొదలవుతుందని చెప్పి అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. ఈ ఫ్రాంఛైజీలో దీపికా పదుకొనే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే రీసెంట్‌గా తనకు కూతురు పుట్టడంతో నెమ్మదిగా కోలుకుంటోంది దీపికాపదుకొనే . ప్రస్తుతానికి కొత్త సినిమాలకైతే గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.

దీపికాపదుకొనే అందుబాటులోకి వచ్చే విషయంపై ఫైనల్ కాల్ రాగానే.. దానికనుగుణంగా కల్కి సీక్వెల్ షూట్ చేయాలని నాగ్ అశ్విన్ టీం ప్లాన్ చేస్తుందట. మొత్తానికి ఈ ఏడాది సెకండాఫ్‌లో కల్కి సీక్వెల్ సెట్స్‌పైకి వెళుందన్న అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు అభిమానులు.

ఫస్ట్ పార్ట్‌లో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రలు పోషించారు. బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్‌గా నటించాడు. మరి సీక్వెల్‌లో ఎవరెవరు కనిపించబోతున్నారు.. కొత్త పాత్రలు ఏమైనా యాడ్ కాబోతున్నాయా..? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



## సినిమాలు వదిలేయాలనుకున్నా..

### రాచరికం ఈవెంట్‌లో అప్సరరాణి



మూవీడెస్క్,27 జనవరి( క్రాంతి న్యూస్ ): వరుణ్‌సందేశ్, విజయ్‌శంకర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'రాచరికం' . అప్సరా రాణి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సురేష్ లంకపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 1న గ్రాండ్‌గా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే లాంచ్ చేసిన ఈ మూవీ ట్రైలర్‌క మంచి స్పందన వస్తోంది. తాజా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేశారు.తాను సినిమాలు వదిలేయాలనుకున్నానంటూ కామెంట్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది.

ఈవెంట్‌లో అప్పర రాణి మాట్లాడుతూ.. రాచరికంలో ఇంత మంది పాత్రను ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. నాకు ఒకే రకమైన పాత్రలొస్తున్నాయని సినిమాలు వదిలేయాలనుకున్నా. ఆ టైంలోనే ఆ దేవుడు వీళ్లను నా దగ్గరకు పంపించాడు. విజయ్ శంకర్‌తో రాచరికం సినిమాలో నటించడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చింది.

ట్రైలర్‌లో.. రాచకొండ ఒక అడవి లాంటి దప్పా. ఈడ బలంతో పోరాడే పులులు.. బలగంతో పోరాడే ఏనుగులు.. ఎత్తుకుపైఎత్తేసే గుంట నక్కలు.. కాసుకొని కాటేసే విషసర్పాలుంటాయి. ఆదిపత్యం కోసం జరిగే పోరులో రక్తపాతాలే తప్ప రక్త సంబంధాలుండవంటూ సాగుతున్న డైలాగ్స్ హైప్ పెంచేస్తున్నాయి. సినిమా ఎలా ఉండబోతుందో ట్రైలర్‌లోని డైలాగ్స్ హింట్ ఇచ్చేస్తూ క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. అప్సర రాణి ఓ వైపు గ్లామర్ డోస్ పెంచుతూనే.. మరోవైపు యాక్టింగ్‌తో అదరగొట్టేయబోతున్నట్టు ట్రైలర్ చెబుతోంది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com